క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ 9440322964 లో సంప్రదించాలని కోరారు.

తాగునీటి బోర్ల మరమ్మతులకు 'క్రాస్‌ప్రోగ్రాం'



క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: తాగునీటి బోర్ల మరమ్మతుల కోసం చేపడుతున్న క్రాస్ ప్రోగ్రాంను సద్వినియోగించుకోవాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రాస్ ప్రోగ్రాంకు సంబంధించిన వాహనాన్ని శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు, జేఈ ప్రవీణ్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక భవిత కేంద్రంలో అడ్డాల మామిడిగూడకు చెందిన సవర డేవిడ్‌పాల్‌కు అధికారులు వీల్‌చైర్ అందజేశారు. మస్తిష్క పక్షవాతంతో బాధపడుతున్న చిన్నారికి వీల్‌చైర్ అందించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు, హెచ్‌ఎం ఎస్.భాస్కరరావు, ఐఈఆర్‌పీ కె.చక్రధర్, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు



పట్టణంలోని లాడ్జీలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, తదితరులు

పాలకొండ రూరల్: ఇతర ప్రాంతాల నుంచి వచ్చి లాడ్జీల్లో బస చేసేవారి సమగ్ర సమాచారం తీసుకున్న తరువాతే రూంలు మంజూరు చేయాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం సీఐ మీసాల చంద్రమౌళితో కలిసి పట్టణంలోని అన్ని లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రూంలలో బస చేస్తున్న వ్యక్తుల ఆధార్ కార్డులతో పాటు వారి పూర్తి వివరాలు సేకరించారు. లాడ్జీల యజమానులు రోజువారీ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. వసతి కోసం వచ్చే వ్యక్తులకు అడ్రస్, ఆధార్, ఫోన్ నంబర్ వంటివి కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సీసీ టీవీ కెమెరాల వినియోగం, వాటి ఆవశ్యకతను లాడ్జిల యజమానులకు వివరించారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అనుమతించవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. పాలకొండలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. 117 జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తాము తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ఆయనతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి

పాలకొండ: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కు చట్టం రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం జిల్లా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ హక్కు చట్టం-23తో సామాన్య రైతులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. న్యాయవాది ఉత్తరావల్లి మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయస్థానం పరిధిలో లేకుండా ఈ చట్టం ఉందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. పలువురు న్యాయవాదులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో భామిని

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- నాలుగున్నరేళ్లలో మారిన రూపురేఖలు



నిర్మాణంలో ఉన్న ఏకలవ్య గిరిజన ఆదర్శ పాఠశాల

భామిని: అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ప్రగతికి పెద్దపీట వేయడంతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. ప్రభుత్వ సేవలన్నీ గడప వద్దకు చేరుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నారు. భామిని మండల కేంద్రంలో నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో ఇంటికి లక్షలాది రూపాయలను అందజేశారు.



రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం



రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.40 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం
- రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.4.23 కోట్లతో వంద టన్నుల కెపాసిటీ గల మినీ గోదాంల ఏర్పాటు
- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణం
- నాడు–నేడు కింద రూ.28.38 లక్షలతో పీహెచ్‌సీలో ఆధునిక వసతుల కల్పన
- రూ.6.5 కోట్లతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నూతన భవనాల నిర్మాణం
- రూ.12 కోట్లతో 12 ఎకరాల విస్తీర్ణంలో ఏకలవ్య ఆదర్శ పాఠశాల భవనాల నిర్మాణం
- రూ.15 లక్షలతో సీసీ కాలువలు, మరో రూ.16 లక్షలతో సీసీరోడ్లు నిర్మాణం
- రూ.35.32 లక్షలతో భామిని జెడ్పీహెచ్‌ఎస్‌లో అభివృద్ధి పనులు
- నాడు–నేడు కింద రూ.18.79 లక్షలతో భామిని కాలనీ ఎంపీపీ స్కూల్‌లో మౌలిక వసతుల కల్పన
- కేజీబీవీలో రూ.40 లక్షలతో అదనపు భవనాలు, అధునాతన హంగుల ఏర్పాటు
- ఏపీ మోడల్ స్కూల్‌లో రూ.64.92 లక్షలతో అభివృద్ధి పనులు
- ఆశ్రమ పాఠశాలలో రూ.17.96 లక్షలతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో రూ.61.32 లక్షలతో అదనపు భవనాల నిర్మాణం
- సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో గ్రామంలోని అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో డీబీటీ ద్వారా రూ.7.92 కోట్లు జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.1.79 కోట్ల లబ్ధి చేకూర్చింది.

నవరత్నాలతో ప్రతి ఇంటా ఆనందం



సీఎం జగనన్న అందిస్తున్న నవరత్న పథకాలతో ప్రతీ కుటుంబం ఆనందంగా ఉంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఎదో ఒక పథకం అందుతోంది. మాకు రైతుభరోసా, వైఎస్సార్ కాపునేస్తం, నా కుమారిడి చదువుకు జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు అందుతున్నాయి. రేషన్ సరుకులు ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇస్తున్నారు. సచివాలయానికి వెళ్లి అన్ని పనులు చేయించుకుంటున్నాం. ఇంతకంటే ఒక సామాన్యుడికి ఏం కావాలి. – **రొక్కం రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, భామిని**

వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలి



వ్యూ పాయింట్ పనులను పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: వారం రోజుల్లో ఆడలి వ్యూ పాయింట్ పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వ్యూ పాయింట్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని పీహెచ్‌ఓ గణేష్‌ను ఆదేశించారు. ఆమె వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

10న చేయూత నాలుగో విడత కార్యక్రమం



మహిళకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం అప్పలనాయుడు

గరుగుబిల్లి: వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమాన్ని ఈ నెల 10న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రారంభిస్తారని వైకేపీ ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు తెలిపారు. వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 45–60 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆ నిధులను మహిళలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధులు పొందాలని సూచించారు. ఈ నెల 10న నిర్వహించే చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. లబ్ధిదారులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు చందాన తిరుపతిరావు, చింతాడ ప్రసాద్, బొంగు రామినాయుడు, కింజంగి కృష్ణ, వి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తం



గంగన్నదొరవలసలో మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

కురుపాం: మలేరియా వ్యాప్తిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సహాయక అధికారి డి.సూర్యనారాయణ సూచించారు. మండలంలోని నీలకంఠాపురం పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను వైద్యాధికారి అభినవ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీహెచ్‌సీ పరిధిలోని గంగన్నదొరవలస గిరిజన గ్రామాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, మలేరియా వ్యాప్తి, తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఆయన వెంట మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహనరావు, మలేరియా సూపర్‌వైజర్ శ్రీహరి రావు, కేశవనాయుడు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



కురుపాం: కోనగూడ బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గిరిజన గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుమ్మ పంచాయతీ కోనగూడ గిరిజన గ్రామానికి జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా పట్టించుకోలేదని, కనీస వసతులు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజనుల సంక్షేమంతో పాటు గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరిక గోపాలరావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీ రాజేశ్వరి, విద్యారాణి, మండల కన్వీనర్ గౌరీశంకర్, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, ఇంటికుప్పల రామకృష్ణ, అనంత్, ఆనిమి ఇందిరాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం

గరుగుబిల్లి: ప్రభుత్వం గిరిజన గ్రామాలను కలుపుతూ కోట్లాది రూపాయల ఖర్చుతో రహదారుల నిర్మాణం చేపడుతోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. పార్వతీపురం–శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి జంక్షన్ నుంచి పిట్టలమెట్ట గ్రామం వరకు దాదాపు 1కోటి 40లక్షల రూపాయలతో అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడుతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల సంఖ్యను ఎలా తగ్గించాలని ఆలోచన చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలకు రోడ్లు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గరుగుబిల్లి సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు, నాయకులు అంబటి గౌరునాయుడు, మంత్రి బుడ్డి బలరామునాయుడు, మాజీ ఎంపీటీసీ మంత్రబుడ్డి పార్వతమ్మ, అశోక్ బ్రహ్మ, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, ఎం.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ పాలవలన విక్రాంత్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాలకొండ పట్టణంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థలను బలోపేతం చేసిందన్నారు. జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ మాట్లాడుతూ.. యువతకు ఎక్కడ ఉద్యోగ అవకాశం వచ్చినా ముందుగా ఆ ఉద్యోగంలో చేరాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు జరిగిన రెండు నెలల్లో 20 జాబ్ మేళాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమౌతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 386 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 112 మంది పలు కంపెనీల్లో ఉద్యోగం పొందారు. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 13 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. ప్రతిభ కనబరిచిన యువతకు జాయినింగ్ అనుమతులు మంజూరు చేశాయి.

చకచకా పింఛన్ల పంపిణీ



వీరఘట్టం: వీరఘట్టంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు




పాలకొండ: పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

సామాజిక పింఛన్ లబ్ధిదారులకు ఒకటో తేదీ ఉదయమే పింఛన్ డబ్బులు అందడంతో వారంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. శుక్రవారం ఉదయమే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు 75 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. పాలకొండ పట్టణంలోని దేవరపేటకు చెందిన పింఛన్‌దారు కె.ఎస్.రాజు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా.. వలంటీర్ పిన్నింటి ఢిల్లీశ్వరి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు. అలాగే భామిని మండలం బత్తిలికి చెందిన ప్రభావతి పట్నాయక్ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతుండడంతో వలంటీర్ గౌడ శివాజీ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్, పాలకొండ

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో డ్రాప్స్ తప్పనిసరి



పాలకొండ రూరల్: పల్స్‌పోలియో నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారులు

పాలకొండ రూరల్: చిన్నారుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు 0–5 ఏళ్లలోపు వయసు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు సూచించారు. మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల సిబ్బందితో వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్ శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. 104 మంది వైద్య సిబ్బందిని 26 బృందాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కోటదుర్గమ్మ దేశస్థానం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది వారికి నిర్దేశించిన లక్ష్యాలను శతశాతం చేరుకోవాలని సూచించారు.

- పాలకొండ: ఈ నెల 3న చేపట్టనున్న 'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ కోరారు. మండలంలోని కొండాపురం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరారు.
- గుమ్మలక్ష్మీపురం: ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ కోరారు. మండల పరిషత్‌లో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. 5 ఏళ్లలోపు వయసున్న పిల్లలందరికీ చుక్కల మందు వేయాలని సూచించారు. తొలిరోజు తప్పిపోయిన వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేయాలని సూచించారు.

మెరుగైన సేవలందించాలి


సీతంపేట: గ్రామ సచివాలయాల ద్వారా ఇంకా మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని కీసరజోడు, పూతికవలస గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. ఆరోగ్యశ్రీ కార్డుల ఈకేవైసీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాను గుర్తించేందుకు రక్తపరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు




సీతంపేట: బాలుర కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని తమకు కేటాయించిన రూంలను చూసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి కాపీయింగ్ జరగకుండా అధికారులు తనిఖీలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తొలిరోజు పరీక్షలకు పదుల సంఖ్యలో విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. – సాక్షి పాలకొండ/కురుపాం



వీరఘట్టం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



కురుపాం: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూస్తున్న విద్యార్థులు